సాక్షి
అనంతపురం
బుధవారం । 6 । సెప్టెంబర్ । 2023



చీనీ టన్ను రూ. 22 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.22 వేలు పలికాయి.



టమాట కిలో రూ.13.50
కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.13.50 పలికింది. కనిష్టం రూ.3.50, సరాసరిన రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
29.4°/21.7°
జిల్లా అంతటా మంగళవారం తుపాను వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. పగలంతా ఆకాశం మేఘావృతమై చాలా ప్రాంతాల్లో జడితో కూడిన తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

80 శాతం సబ్సిడీపై ప్రత్యామ్నాయ విత్తనాలు



పెసలు, ఉలవలు

అనంతపురం అగ్రికల్చర్: ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 80 శాతం సబ్సిడీపై విత్తనాలు ఇస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయం తెలిపింది. ఏపీ సీడ్స్ ఆధ్వర్యంలో ఇప్పటికే 2,903 క్వింటాళ్ల ఉలవలు, 390 క్వింటాళ్ల అలసందలు, 160 క్వింటాళ్ల పెసలు, 22 క్వింటాళ్ల కొర్రలు ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది. 80 శాతం సబ్సిడీ పోను కిలో ఉలవలు రూ.21.60, అసలందలు రూ.23, పెసలు రూ.23.50, కొర్రలు రూ.13.50 ప్రకారం చెల్లించి తీసుకోవాలని రైతులకు సూచించింది. ఇప్పటికే 140 క్వింటాళ్ల పంపిణీ పూర్తయిందని తెలిపింది. వర్షాలు వస్తున్నందున ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని సూచించింది.

డిసెంబర్‌లోపు డ్రిప్ లక్ష్యం పూర్తి కావాలి



ఫిరోజ్‌ఖాన్‌తో కలిసి సమీక్షిస్తున్న ఓఎస్‌డీ వైవీఎస్ ప్రసాద్

అనంతపురం అగ్రికల్చర్: 2023–24 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన 12,500 హెక్టార్ల బిందు, తుంపర సేద్యం (డ్రిప్, స్ప్రింక్లర్ల) పరికరాల పంపిణీ లక్ష్యం డిసెంబర్ లోపు పూర్తి చేయాలని ఏపీఎంఐపీ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ) వైవీఎస్ ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం ఆయన నగరంలోని ఏపీఎంఐపీ కార్యాలయంలో పీడీ జి.ఫిరోజ్‌ఖాన్, ఏడీపీ ఫజులున్నీసాబేగంతో కలిసి ఎంఐ ఇంజినీర్లు, ఎంఐఏఓలు, కంపెనీ డీసీఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. 12,500 హెక్టార్ల లక్ష్యానికి గాను ప్రస్తుతానికి 6,500 హెక్టార్లకు రైతుల నుంచి నాన్‌సబ్సిడీ మొత్తం వచ్చినందున... పరిపాలనాపరమైన అనుమతులు, మెటీరియల్ సరఫరా, ఇన్‌స్టలేషన్, తనిఖీలు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇక గతేడాదికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న 40 యూనిట్ల బిగింపు, తనిఖీలు రెండు మూడు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఎక్కడా సమస్య లేకుండా.. దుర్వినియోగం కాకుండా పథకం అమలు చేయాలని ఆదేశించారు.

26 మండలాల్లో జడి వాన



అనంతపురం అగ్రికల్చర్: ఉపరితల ఆవర్తనం, ఉపరితల ద్రోణి ప్రభావంతో జిల్లాలో జడితో కూడిన వర్షాలు కొనసాగుతున్నాయి. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు 26 మండలాల పరిధిలో 6.5 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. కణేకల్లు 21.8 మి.మీ, బెళుగుప్ప 19.8, డి.హీరేహాళ్ 19, కూడేరు 15.6, కళ్యాణదుర్గం 15.4, ఆత్మకూరు 13.6 మి.మీతో పాటు మిగతా మండలాల్లో తేలికపాటితో కూడిన జడివాన కురిసింది. మంగళవారం పగలంతా ఆకాశం పూర్తిగా మేఘావృతమై చాలా ప్రాంతాల్లో తేలికపాటి జడి నమోదైంది.

- సెప్టెంబర్ నెల సాధారణ వర్షపాతం 110.9 మి.మీ కాగా ప్రస్తుతానికి 50 మి.మీ నమోదైంది. ఈ సీజన్‌లో జూన్ ఒకటి నుంచి 2122.5 మి.మీకు గాను 18 శాతం తక్కువగా 182.8 మి.మీ నమోదైంది. ఆత్మకూరు మండలంలో సాధారణం కన్నా ఎక్కువగానూ, 13 మండలాల్లో సాధారణంగానూ, మిగతా 17 మండలాల్లో తక్కువగా వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో 22 వర్షపు రోజులు రికార్డయ్యాయి. కాగా.. రాగల రెండు రోజులు జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

నడయాడే దేవుడు గురువు





గురుపూజోత్సవంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం, హాజరైన ఉపాధ్యాయులు

- భవిష్యత్ తరాలను తీర్చిదిద్దేది గురువులే
- విలువైన ఆస్తి చదువు ఒక్కటే
- విద్యారంగానికి సర్కారు పెద్దపీట
- గురు పూజోత్సవంలో వక్తలు
- 30 మందికి జిల్లాస్థాయి ఉత్తమ టీచర్ అవార్డుల ప్రదానం

రాప్తాడురూరల్: 'భవిష్యత్ తరాలను సమున్నతంగా తీర్చిదిద్దేది గురువులే. గురువును మించిన వారు ఎవరూ లేరు. గుడిలాంటి బడిలో నడయాడే దేవుడు గురువు' అని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ కొనియాడారు. భారతరత్న, దివంగత రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం జిల్లాస్థాయి గురుపూజోత్సవ వేడుకలను అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల డ్రామా హాలులో డీఈఓ వి.నాగరాజు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ తరగతి గదిలోనే దేశ భవిష్యత్ ఉంటుందని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చాటి చెప్పారన్నారు. కష్టపడి చదివితే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. గురువులు ఉన్నస్థితిలోనే ఉంటూ పిల్లలను ఉన్నత స్థితికి చేర్చేందుకు తపన పడుతుంటారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. నాడు–నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారన్నారు. ఓవైపు మౌలిక వసతులు కల్పిస్తూ మరోవైపు ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరిస్తున్నారన్నారు. నగర మేయర్ వసీం మాట్లాడుతూ ఆర్ట్స్ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేసిన రాధాకృష్ణన్ రాష్ట్రపతి స్థాయికి ఎదగడం గర్వకారణమన్నారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలంటూ టీచర్లు ఇంటింటికీ వెళ్లేవారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత తీసుకొచ్చిన సంస్కరణలతో చాలా ప్రభుత్వ స్కూళ్లలో 'సీట్లు ఫుల్' అనే బోర్డులు కనిపిస్తున్నాయన్నారు. ఇందుకు ప్రభుత్వంతో పాటు గురువుల కృషి చాలా ఉందన్నారు. డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య మాట్లాడుతూ రాయిలాంటి విద్యార్థులను శిలలుగా మార్చే శిల్పులు ఉపాధ్యాయులన్నారు. విద్యకు భౌతికరూపం విద్యాలయం అన్నారు. విశ్వ గురువుగా మనదేశం ఎదగడం అభినందనీయమన్నారు. సమాజంలో గురువుల సేవలను శాశ్వతంగా గుర్తుపెట్టుకుంటారన్నారు. ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత మాట్లాడుతూ పిల్లలకు చదువుతో పాటు సంస్కారం నేర్పే గురువులను ఎప్పటికీ మరువలేమన్నారు. చదువుకు మించిన ఆస్తి లేదన్నారు. పేద వర్గాలకు ఆర్థిక భారం కాకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కేజీ నుంచి పీజీ వరకు ఉచితంగా చదివిస్తోందన్నారు. అనంతరం ఉత్తమ అవార్డులకు ఎంపికైన 30 మంది టీచర్లను అతిథుల చేతుల మీదుగా సన్మానం చేసి అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓలు పద్మప్రియ, శంకరప్రసాద్, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పురస్కారాల స్వీకరణ





విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ నుంచి ఉత్తమ ఆచార్య పురస్కారాన్ని అందుకుంటున్న రాంగోపాల్, రమణ, పద్మ సువర్ణ, చిత్ర



రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డులు అందుకున్న సుధాకర్, విష్ణుప్రియ, ఉత్తమ టీచర్ పురస్కారం అందుకున్న రాధిక,రమణప్రసాద్

అనంతపురం: విద్యా రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న ప్రొఫెసర్లకు ఏటా ఉత్తమ ఆచార్య పురస్కారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. గురుపూజోత్సవం సందర్భంగా మంగళవారం ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా పురస్కారాలు అందజేశారు. రాష్ట్రస్థాయి ఉత్తమ ఆచార్య పురస్కారాలను శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నుంచి ఫిజిక్స్ ప్రొఫెసర్ కె.రాంగోపాల్ (సీడీసీ డీన్, పాలిమర్ సైన్సెస్ విభాగాధిపతి), సోషియాలజీ ప్రొఫెసర్ జీవీ రమణ (డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్), జేఎన్‌టీయూ అనంతపురం నుంచి ఇంగ్లిష్ ప్రొఫెసర్ వీబీ చిత్ర, ఫిజిక్స్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ పద్మ సువర్ణ అందుకున్నారు. వీరిని ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

ఉత్తమ అధ్యాపకులు, ఉపాధ్యాయులుగా..
రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకులుగా విష్ణుప్రియ (వృక్షశాస్త్రం, ఆర్ట్స్ కాలేజీ, అనంతపురం), కరణం సుధాకర్ (చరిత్ర, ఆర్ట్స్ కాలేజీ, అనంతపురం), ఉత్తమ ఉపాధ్యాయులుగా రాధిక (గణితం, జెడ్పీ బాలికల హైస్కూల్, గుత్తి), రమణప్రసాద్ (హెచ్‌ఎం, పి.నారాయణపురం ప్రాథమిక పాఠశాల, కూడేరు మండలం) మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.



ఉపాధ్యాయ దంపతులు సుజాత, మోజెస్‌లకు అవార్డు అందజేసి.. సన్మానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం, వాసంతి, ఏడీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత, డీఈఓ నాగరాజు తదితరులు



ముజీనా | ప్రభాంజలి | శ్రీవాణి | ఓంకారేశ్వర్ | సుంకన్న | జయరాజ్ | శ్రీనివాసులు | రంగనాథ్



రామకృష్ణయ్య | చంద్రమోహన్ నాయక్ | మహ్మద్ రఫీ | ఆదిలక్ష్మి | రమేష్‌బాబు | ఓబులేసు | తిమ్మరాజు | శ్రీధర్



ఎర్రిస్వామి | చితంబరరెడ్డి | వెంకట సురేష్ | చిన్న బసవయ్య | రవికుమార్ | అస్మతార | సంగప్ప | రాజశేఖర్ | యల్లప్ప | హరి ప్రియాంక | సరస్వతి | యల్లబోయిన రవి

జిల్లా నూతన ఎస్పీగా అన్బురాజన్

- విశాఖ డీసీపీగా కంచి శ్రీనివాసరావు బదిలీ



కేకేఎస్ అన్బురాజన్

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: జిల్లా నూతన ఎస్పీగా కేకేఎస్ అన్బురాజన్ నియమితులయ్యారు. ఇక్కడ ఎస్పీగా ఉన్న కె.శ్రీనివాసరావు విశాఖపట్నం డీసీపీ (లా అండ్ ఆర్డర్)గా బదిలీ అయ్యారు. రాష్ట్రంలో పలువురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ప్రస్తుతం వైఎస్సార్ జిల్లా ఎస్పీగా ఉన్న అన్బురాజన్‌ను అనంతపురానికి బదిలీ చేశారు. 2011 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన అన్బురాజన్ వైఎస్సార్ జిల్లాలో మూడేళ్లుగా పనిచేస్తున్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో నిక్కచ్చిగా వ్యవహరించే అధికారిగా గుర్తింపు పొందారు. ఆ జిల్లా వాసులతో మంచి అనుబంధాన్ని ఏర్పరుచుకున్నారు. సిబ్బంది సంక్షేమం విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ చూపారు. సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లా ఎస్పీగా వస్తున్నారు. మరో రెండు రోజుల్లో ఇక్కడ బాధ్యతలు తీసుకోనున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఇక ఇక్కడి నుంచి బదిలీ అయిన కె. శ్రీనివాసరావు పనిచేసింది కొద్దికాలమే అయినా సమర్థవంతమైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు. ఆయన సమర్థతను గుర్తించిన ప్రభుత్వం కీలకమైన విశాఖ పట్నం డీసీపీ పోస్టులో నియమించింది.

అన్బురాజన్ ఉద్యోగ ప్రస్థానం
అన్బురాజన్ తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరు జిల్లాలో మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చారు. ఆయన తల్లిదండ్రులు షణ్ముఖవల్లి, నాగేంద్ర కుమార్ ఉపాధ్యాయులు. మధురై కామరాజ్ యూనివర్సిటీలో ఎం.టెక్ పూర్తి చేసిన తర్వాత టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేశారు. 2011లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. మొదటి పోస్టింగ్ గ్రే హౌండ్స్‌లో ఇచ్చారు. తర్వాత చిత్తూరు, తూర్పుగోదావరి, వైఎస్సార్ జిల్లాల్లో ఏఎస్పీగా, తిరుపతి అర్బన్ ఎస్పీగా పనిచేశారు.

14వ బెటాలియన్ కమాండెంట్‌గా గంగాధరరావు
అనంతపురం 14వ బెటాలియన్ కమాండెంట్‌గా ఆర్.గంగాధరరావును ప్రభుత్వం నియమించింది. అన్నమయ్య జిల్లా ఎస్పీగా ఉన్న ఈయన బదిలీపై ఇక్కడికి వస్తున్నారు. ప్రస్తుతం కమాండెంట్‌గా ఉన్న పి.జగదీష్‌ను బదిలీ చేసి.. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీగా నియమించింది.

బాధ్యతాయుతంగా రీవెరిఫికేషన్

ఉరవకొండ/విడపనకల్లు: స్పెషల్ సమ్మర్ రివిజన్–2024లో భాగంగా చేపడుతున్న ఓటరు జాబితా రీవెరిఫికేషన్ ప్రక్రియను బీఎల్‌ఓలు బాధ్యతాయుతంగా చేయాలని కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. మంగళవారం ఉరవకొండ మండలం చిన్న ముస్టూరు, విడపనకల్లు మండలం మాళాపురం గ్రామాల్లో స్పెషల్ సమ్మర్ రివిజన్–2024 రీవెరిఫికేషన్ కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్లతో బీఎల్‌ఓలు మీ ఇంటికి వచ్చారా, మీ ఓటు ఎక్కడ ఉందో తెలుసా.. పోలింగ్ స్టేషన్ మీకు దగ్గర్లోనే ఉందా అంటూ పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 2022 జనవరి 6 నుంచి 2023 ఆగస్టు 9 వరకు వచ్చిన తొలగింపు దరఖాస్తులను మరోసారి తిరిగి పరిశీలన చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించిందన్నారు. బీఎల్‌ఓలు వంద శాతం ఇంటింటికి తిరిగి పరిశీలన చేయాలన్నారు. ఈ నెల ఏడో తేదీలోగా ఈప్రక్రియ వంద శాతం పూర్తి చేయాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారిని గుర్తించి, వారికి ఓటు హక్కు కల్పించేలా చూడాలన్నారు. అర్హత ఉండి ఓటరుగా నమోదు కాని వారిని బీఎల్‌ఓలు గుర్తించి జాబితాలో చేర్చాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రవీంద్ర, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, తహసీల్దార్లు హరిప్రసాద్, ఈరమ్మ, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మునీంద్ర, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కృష్ణాష్టమి వేడుకలు

అనంతపురం కల్చరల్: అనంతపురం నగర శివారులోని ఇస్కాన్ (రాధాపార్థసారథి)మందిరంలో బుధవారం నుంచి మూడు రోజులపాటు కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరగనున్నాయి. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. బుధవారం ఉదయం 10 గంటలకు విశ్వశాంతి మహా యజ్ఞం, 12 గంటలకు సామూహిక విష్ణుసహస్ర నామ పారాయణం, హరినామ సంకీర్తన, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రి 8 గంటలకు ఊంజల సేవలు ఉంటాయని ఇస్కాన్ నిర్వాహకుడు దామోదర గౌరంగదాసు వెల్లడించారు. గురువారం కృష్ణాష్టమి సందర్భంగా ఉదయం హరినామ యజ్ఞం, 11 గంటలకు తులసీ అర్చన, సాయంత్రం 4గంటలకు ఉట్టికొట్టు ఉత్సవం, గరుడ వాహన సేవ, 6 గంటలకు తెప్పోత్సవం, రాత్రి 9 గంటలకు దీప హారతి, 11 గంటలకు మహా అభిషేకం, పుష్పాభిషేకం ఉంటాయి. శుక్రవారం ఇస్కాన్ వ్యవస్థాపకుడు శ్రీల ప్రభుపాదుల జయంతి సందర్భంగా లీలామృత శ్రవణం మధ్యాహ్నం 11 గంటలకు గురుదేవుల అభిషేకం, మహా అన్నదాన కార్యక్రమం, సాయంత్రం వాహన సేవలు ఉంటాయన్నారు.



ప్రత్యేక అలంకరణలో రాధాపార్థసారథి

విద్యుద్దీప కాంతుల్లో వెలిగిపోతున్న ఇస్కాన్ మందిరం



ఐటీ నోటీసులపై నోరెత్తరెందుకో?

- చంద్రబాబు, లోకేష్‌లపై మంత్రి ఉషశ్రీచరణ్ ఫైర్



కళ్యాణదుర్గం: టీడీపీ హయాంలో అధికారం అడ్డుపెట్టుకుని చంద్రబాబు, తనయుడు లోకేష్ రాష్ట్ర ఖజానాను అడ్డగోలుగా దోచుకున్నారని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కె.వి.ఉషశ్రీచరణ్ ధ్వజమెత్తారు. తాను నిజాయతీపరుడని గొప్పలు చెప్పుకునే బాబు ఏకంగా రూ.118 కోట్లు కొల్లగొట్టి ఆర్థిక నేరగాడిగా మారాడని విరుచుకుపడ్డారు. 2024 ఎన్నికల ముందు మరోసారి ప్రజలను వంచన చేసేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. మంగళవారం మంత్రి తన స్వగృహంలో మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు ఆర్థిక నేరాలకు పాల్పడ్డారని ఇటీవల ఆదాయ పన్ను అధికారులు నిర్ధారించారన్నారు. అయితే తనకు సంబంధం లేదని చంద్రబాబు చెప్పడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఐటీ శాఖ నోటీసులపై ఎందుకు నోరెత్తడం లేదు బాబూ అంటూ ప్రశ్నించారు. కాంట్రాక్టు పనుల్లో కమీషన్ల రూపంలో రూ.కోట్లు దండుకున్నారని, ఏకంగా మంత్రి వర్గాన్ని తప్పుదోవ పట్టించి తండ్రీ కొడుకులిద్దరూ స్కిల్ డెవలప్‌మెంట్ పేరిట ఏకంగా రూ.350 కోట్లు కొల్లగొట్టారని దుయ్యబట్టారు. ఆర్థిక నేరాల ఆరోపణలపై చంద్రబాబు, లోకేశ్‌లపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి నేరగాళ్లకు మరోసారి అవకాశం ఇస్తే రాష్ట్రం సర్వనాశనమవుతుందన్న విషయాన్ని ప్రజలు ఆలోచించాలన్నారు.

వడివడిగా రీ-సర్వే

- తొలి దశలో 43 గ్రామాల్లో పూర్తి
- రెండో దశలో 57 గ్రామాల్లో ముగిసిన సర్వే
- 18 గ్రామాల్లో హద్దు రాళ్ల ఏర్పాటు

సమగ్ర సర్వే ఇలా...

జిల్లాలో సర్వే చేయనున్న మొత్తం గ్రామాలు	503
సర్వే చేపట్టాల్సి విస్తీర్ణం (చ.కి.మీటర్లు)	10,188.59
డ్రోన్ ఫ్లై పూర్తి చేసిన గ్రామాలు	503
ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజెస్ వచ్చిన గ్రామాలు	449
తొలి విడతలో సర్వే పూర్తయిన గ్రామాలు	43
రెండో విడతలో సర్వే పూర్తయిన గ్రామాలు	57
హద్దురాళ్లు ఏర్పాటైన గ్రామాల సంఖ్య	18



హద్దు రాళ్లు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్: భూ వివాదాలు... సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకం ద్వారా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన భూముల సమగ్ర సర్వే కార్యక్రమం వడివడిగా సాగుతోంది. జిల్లాలోని 31 మండలాల పరిధిలో ఉన్న 503 గ్రామాల్లో 10,188.59 చదరపు కిలోమీటర్ల మేర భూమిని సర్వే చేయనున్నారు. తొలి విడతలో ఎంపిక చేసిన 47 గ్రామాల్లో సర్వే ప్రక్రియ పూర్తి కాగా, రెండో విడతలో 57 గ్రామాల్లో సర్వే పూర్తయింది. హద్దు రాళ్ల ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. నిర్దేశించిన గడువులోపు రీ-సర్వే పూర్తి చేసేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించుకోవడమే కాక, దానిని పటిష్టంగా అనుసరిస్తూ పనులు వేగవంతం చేశారు.

సర్వే ప్రక్రియ వేగవంతం

జిల్లాలో సమగ్ర సర్వే ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది. మొత్తం 503 గ్రామాల్లో డ్రోన్ ఫ్లై పూర్తయింది. 449 గ్రామాలకు సంబంధించి ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజస్ వచ్చాయి. తొలి విడత కింద రీ-సర్వే చేపట్టిన 47 గ్రామాల్లో అన్ని ప్రక్రియలను పూర్తి చేశారు. 60,575 హద్దు రాళ్లను ఏర్పాటు చేశారు. రెండో విడత కింద 57 గ్రామాల్లో చేపట్టిన సర్వే పూర్తయ్యింది. 18 గ్రామాల్లో హద్దు రాళ్ల ఏర్పాటు పూర్తికాగా, మిగిలిన గ్రామాల్లో పనులు వేగవంతం చేశారు.

కొనసాగుతున్న మూడో విడత

తొలి రెండు విడతల్లో వంద గ్రామాల్లో సర్వే ప్రక్రియ పూర్తి చేసిన యంత్రాగం... మూడో విడత కింద 350 గ్రామాల్లో సర్వే చేపట్టారు. ఇందుకు సంబంధించి ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. రోవర్ ద్వారా భూమి హద్దులను ఎలా గుర్తించాలనే అంశంపై సర్వే అసిస్టెంట్లు, మండల సర్వేయర్లు, వీఆర్‌ఓలు, తదితర సిబ్బందికి ప్రత్యేకంగా క్షేత్రస్థాయిలో శిక్షణ ఇచ్చారు.

స్వయంగా సరి చూసుకోవాలి



రెండో విడతలో భాగంగా 57 గ్రామాల్లో సర్వే పూర్తయ్యింది. ఇప్పటి వరకూ 18 గ్రామాల్లో హద్దు రాళ్లు ఏర్పాటు చేశాం. మిగిలిన గ్రామాల్లో పనులు సాగుతున్నాయి. హద్దు రాళ్లు ఏర్పాటు చేసేటప్పుడు సంబంధిత భూ యాజమాని తప్పక హాజరవ్వాలి. హద్దులు సరిగ్గా నిర్ణయించి రాళ్లను ఏర్పాటు చేస్తున్నది? లేనిది స్వయంగా సరి చూసుకోవాలి.

– రూప్లానాయక్, ఏడీ సర్వే భూరికార్డుల శాఖ

గడువులోపు రీ సర్వే పూర్తి



నిర్దేశించిన గడువులోపు జిల్లావ్యాప్తంగా 503 గ్రామాల్లో రీ-సర్వే పూర్తి చేస్తాం. మొదటి, రెండో విడతల్లో భాగంగా 100 గ్రామాల్లో సర్వే పూర్తయ్యింది. మూడో విడత కింద 350 గ్రామాల్లో సర్వే చేపట్టారు. ఈ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాం.

– కేతన్‌గార్గ్, జాయింట్ కలెక్టర్

క్లుప్తంగా

ఎరువుల అమ్మకాలు నిలిపివేత



రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ రవి, ఏఓ శశికళ

అనంతపురం అగ్రికల్చర్: నిబంధనలకు విరుద్ధంగా విక్రయానికి ఉంచిన రూ.2.10 లక్షల విలువ చేసే వివిధ రకాల ఎరువుల అమ్మకాలను నిలిపివేస్తే వ్యవసాయ శాఖ ఏడీ ఎం.రవి ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం రూరల్ ఏఓ ఆర్.శశికళతో కలసి జిల్లా కేంద్రంలోని న్యూ బాలాజీ ఫర్టిలైజర్స్ దుకాణంలో మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఎరువులు, పురుగు మందులు సరఫరా, అమ్మకాలు, నిల్వలు, వివిధ రకాల లైసెన్సులు పరిశీలించారు. ఇందులో నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేసుకున్న ఎరువులను గుర్తించి, స్టాఫ్ సేల్స్ ఉత్తర్వులు ఇచ్చారు. వాటికి సంబంధించిన పక్కా రికార్డులు సమర్పించకపోతే సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులకు ఒరిజినల్ బిల్లులు ఇవ్వాలని, ఎంఆర్‌పీకి మించి అమ్మినా, నిబంధనలకు విరుద్ధంగా నాసిరకం సరుకు విక్రయించినా చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు.

వేధింపులు తాళలేక ఆస్పత్రి పాలైన వివాహిత

కళ్యాణదుర్గం: అదనపు కట్నం కోసం భర్త వేధింపులు తాళలేని ఓ వివాహిత అనారోగ్యంతో ఆస్పత్రి పాలైంది. పోలీసులు తెలిపిన మేరకు.. కంబదూరు మండలం మేళ్లకుంట గ్రామానికి చెందిన సుకన్యకు ఎనిమిదేళ్ల క్రితం కళ్యాణదుర్గం మండలం కొండాపురం గ్రామానికి చెందిన మురళితో వివాహమైంది. బెంగళూరులోని ఓ ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న మురళి అక్కడే భార్యతో కలసి ఉంటున్నాడు. ఈ క్రమంలో వారం రోజులుగా అదనపు కట్నం కోసం మురళితో పాటు అతని కుటుంబసభ్యులు తీవ్రంగా వేధించడంతో పాటు శారీరకంగా, మానసికంగా హింసించారు. వారి వేధింపులను తాళలేని సుకన్య తీవ్ర అస్వస్థతకు లోనై సోమవారం రాత్రి కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీలో చేరారు. ప్రాథమిక చికిత్స చేసిన వైద్యులు... మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. ఘటనకు సంబంధించిన సమాచారాన్ని సీహెచ్‌సీ ఔట్‌పోస్టు పోలీసులు కంబదూరు పోలీసులకు చేరవేశారు.

స్టాక్ పాయింట్ తనిఖీ చేసిన డీఎస్‌ఓ



గోదాములో నిల్వలు పరిశీలిస్తున్న డీఎస్‌ఓ శోభారాణి

గుత్తి రూరల్: స్థానిక కర్నూలు రోడ్డులో ఉన్న ఎంఎల్‌ఎస్ స్టాక్ పాయింట్‌ను మంగళవారం డీఎస్‌ఓ శోభారాణి తనిఖీ చేశారు. కంది బేడల స్టాక్ రికార్డులు పరిశీలించారు. ప్రతి నెలా రేషన్ దుకాణాలకు సరఫరా చేసే బియ్యం, పంచదార కోటా, అంగన్‌వాడీ కేంద్రాలకు కందిబేడల సరఫరాపై ఆరా తీశారు. రేషన్ దుకాణాలకు సరైన తూకం కలిగిన బస్తాలను మాత్రమే సరఫరా చేయాలని స్టాక్ పాయింట్ సిబ్బందికి సూచించారు. పీడీఎస్ బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఎంపీ మాధవ్‌తో ఎలాంటి విభేదాలూ లేవు

- ఆరోపణలపై రామదాసప్ప నాయుడును లోతుగా విచారించాలి
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిష్టప్ప



మాట్లాడుతున్న కిష్టప్ప

రాప్తాడు రూరల్: తనకు, ఎంపీ గోరంట్ల మాధవ్‌కు మధ్యలో విభేదాలున్నాయని సీనియర్ జర్నలిస్టుగా చెప్పుకుంటున్న రామదాసప్ప నాయుడు చేసిన ఆరోపణలు వాస్తవం కాదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీసీ అధ్యయన కమిటీ సభ్యుడు కిష్టప్ప స్పష్టం చేశారు. మంగళవారం అనంతపురం శివారులోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తన రాజకీయ ఎదుగుదలను జీర్ణించుకోలేక హాని చేసేందుకు ఎంపీ మాధవ్ కుట్ర పన్నినట్లుగా ఇటీవల అనంతపురం ఎస్పీ శ్రీనివాసరావుకు తన ప్రమేయం లేకుండా రామదాసప్ప నాయుడు ఫిర్యాదు చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. ఈ అంశానికి సంబంధించి తనకు కనీస సమాచారం కూడా లేదన్నారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు లోతుగా విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనవసరంగా ఎంపీపై నిరాధార ఆరోపణలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు.

రూ. లక్ష డిమాండ్ చేసిన నాయుడు

ఇటీవల రామదాసప్పనాయుడు హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్‌ను రూ. లక్ష డిమాండ్ చేశారు. 74168 04719 నంబర్‌కు గూగుల్ పే ద్వారా డబ్బు పంపాలని ఎంపీ మొబైల్ నంబర్‌కు మెసేజ్‌లు పెట్టాడు. రెండు రోజుల్లోపు తాను అడిగిన డబ్బు ఇవ్వాలని అందులో పేర్కొన్నాడు.

బాధ్యతగా పనిచేయండి



అధికారులతో మాట్లాడుతున్న కేతన్‌గార్గ్

బ్రహ్మసముద్రం: ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ విధులను బాధ్యతతో నిర్వర్తించాలని మండల పరిషత్ అధికారులను జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ కేతన్‌గార్గ్ ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. తహసీల్దార్ బాలకిషన్ మాట్లాడుతూ.. భూ రీ సర్వే పనులను వివరించారు. వలంటీర్ల , సచివాలయాల పనితీరు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ఉపాధి పనులపై ఎంపీడీఓ దాసానాయక్‌తో చర్చించారు. జగనన్న గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ-క్రాప్ బుక్కింగ్ పక్కాగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుబ్బరాయుడు, హౌసింగ్ ఏఈ చైతన్య, ఏఓ సరిత, జెడ్పీటీసీ సభ్యురాలు ప్రభావతి, ఎంపీపీ చంద్రశేఖరరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య బోధన సాగించండి

నాణ్యమైన విద్యాబోధన సాగించాలని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు జేసీ కేతన్‌గార్గ్ సూచించారు. బ్రహ్మసముద్రం మండలం పిల్లలపల్లిలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ హోదాలో మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను జెడ్పీ ఉన్నత పాఠశాలగా ఉన్నతీకరించేందుకు వచ్చిన ప్రతిపాదనలపై ఈ సందర్భంగా ఆయన సమీక్షించారు. విద్యార్థులతో మాట్లాడుతూ.. బాగా చదువుకుని వృద్ధిలోకి రావాలన్నారు. అనంతరం నాడు- నేడు కార్యక్రమంలో భాగంగా నూతనంగా నిర్మిస్తున్న తరగతి గదులను పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులతో పాటు ఎంఈఓ ఓబుళపతి, సర్పంచ్ తలారి గోవిందప్ప పాల్గొన్నారు.

లీజుకు ఆర్టీసీ స్థలాలు

అనంతపురం సెంట్రల్: జిల్లాలో కళ్యాణదుర్గం, ఉరవకొండ ఆర్టీసీ డిపో పరిధిలోని స్థలాలను 15 ఏళ్ల కాలపరిమితితో లీజుకు ఇవ్వాలని నిర్ణయించినట్లు జిల్లా ప్రజారవాణా అధికారి సుమంత్ ఆర్ ఆదోని తెలిపారు. ఉరవకొండ బిట్-1756 చదరపు గజాలు, కళ్యాణదుర్గం బీ3-846 చదరపు గజాలు, బీ4- 846 చదరపు గజాలు, బీ5- 1016 చదరపు గజాలు, సీ3 -976 చదరపు గజాలు, సీ4-5760 చదరపు గజాలు సంరక్షణలో భాగంగా లీజుకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు టెండర్లలో పాల్గొనాలని కోరారు.

డీఆర్‌ఓగా రాజశేఖర్



అనంతపురం అర్బన్: జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్‌ఓ)గా ఎస్.రాజశేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజశేఖర్ ప్రస్తుతం చిత్తూరు డీఆర్‌ఓగా ఉన్నారు. ఇక్కడ డీఆర్‌ఓగా ఉన్న బి.గాయత్రీదేవికి పోస్టింగ్ ఇవ్వకుండా సాధారణ పరిపాలన శాఖలో రిపోర్ట్ చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 35 మంది డిప్యూటీ కలెక్టర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. అదే విధంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.మధుసూదన్‌రావును (హెచ్‌పీసీఎల్, అనంతపురం) కర్నూలు డీఆర్‌ఓగా నియమించారు.

పౌర సరఫరాల డీఎంగా రవీంద్ర

పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్(డీఎం)గా డిప్యూటీ కలెక్టర్ జె.రవీంద్రను నియమించారు. ఆయన ప్రస్తుతం గుంతకల్లు ఆర్‌డీఓగా ఉన్నారు. గుంతకల్లు ఆర్డీఓగా డిప్యూటీ కలెక్టర్ లవన్నను నియమించారు. లవన్న ప్రస్తుతం భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవస్థానం ఈఓగా ఉన్నారు.

త్వరలో బీఎస్‌ఎన్‌ఎల్ 4జీ సేవలు

అనంతపురం సిటీ: మొబైల్ రంగంలో 4జీ సాంకేతికతను అందిపుచ్చుకుని మరో రెండు నెలల్లో వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు బీఎస్‌ఎన్‌ఎల్ జనరల్ మేనేజర్ ముజీబ్ పాషా మంగళవారం తెలిపారు. ఇప్పటికే కొందరు వినియోగదారులు 3జీ సేవలు పొందుతున్నట్లు వివరించారు. 4జీ సాంకేతికతను ప్రారంభించిన తర్వాత 3జీ సిమ్‌ను 4జీకి మార్చుకోవాలని సూచించారు. 4జీ సిమ్ వేసుకున్నా 2జీ లేదా 3జీ సర్వీసులూ కొనసాగించవచ్చన్నారు. 3జీ సిమ్ కలిగిన వినియోగదారులకు ఈ నెలాఖరు వరకూ ఉచితంగా 4జీ అప్‌గ్రేడేషన్ సౌకర్యం ఉంటుందన్నారు. వినియోగదారులు బీఎస్‌ఎన్‌ఎల్ సేవా కేంద్రాలు, ఫ్రాంచైజీ, రిటైలర్ల వద్ద 4జీ సిమ్ అప్‌గ్రేడేషన్ చేయించుకోవాలన్నారు. ప్రస్తుతం వినియోగిస్తున్న సిమ్ 2జీనా లేక 3జీనా అనే విషయం తెలుసుకునేందుకు మొబైల్ నుంచి సిమ్ అని ఆంగ్లంలో టైప్ చేసి 94412 99999 నంబర్‌కు మెసేజ్ చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన నిబంధనల మేరకు ఒకవేళ తమ సిమ్‌ను పేపర్ అప్లికేషన్ ద్వారా పొంది ఉన్నట్లైతే అటువంటి వినియోగదారులు కేవైసీ ద్వారా డిజిటలైజ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

రెడ్డి జేఏసీ బలోపేతమే లక్ష్యం

- రెడ్డి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు శివకుమార్ రెడ్డి



నినాదాలు చేస్తున్న రెడ్డి జేఏసీ నాయకులు

అనంతపురం టవర్ క్లాక్: రాష్ట్ర వ్యాప్తంగా రెడ్ల ఐక్యతతో పాటు రెడ్డి జేఏసీని బలోపేతం చేయడమే తమ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ రెడ్డి జేఏసీ అధ్యక్షుడు విప్పల శివకుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక కళ్యాణదుర్గం రోడ్డులోని రెడ్డి జేఏసీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కిషోర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన జేఏసీ క్రియాశీలక సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో బలమైన కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రెడ్ల ఐక్యత, ఆర్థికాభివృద్ధే లక్ష్యమన్నారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోనూ రెడ్డి కార్యాలయాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్డి జేఏసీ బలోపేతంపై కమిటీకి దిశా నిర్దేశం చేశారు. అనంతరం రెడ్డి జేఏసీ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా యోగా గురువు కృష్ణవేణిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామాటం శేషాద్రిరెడ్డి హాజరయ్యారు

8 నుంచి ఎస్జీఎఫ్ క్రీడా పోటీలు, ఎంపికలు

రాప్తాడురూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో అనంతపురం మండలం, నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలు, ఎంపికలు ఈ నెల 8 నుంచి 16 వరకు జరుగుతాయని సమన్వయకర్తలు బాలకృష్ణ, ప్రవీణ్ ఓ ప్రకటనలో తెలిపారు. అనంతపురంలోని కొత్తూరు బాలుర ప్రభుత్వ పాఠశాలలో అండర్-14, అండర్-17 విభాగాల్లో బాల బాలికలకు ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. తొలిరోజు జరిగే బాడ్మింటన్ పోటీలు కళ్యాణదుర్గం రోడ్డు (రహమత్ ఫంక్షన్‌హాల్ పక్కన)లోని చిన్న బ్యాడ్మింటన్ అకాడమీలో జరుగుతాయని తెలిపారు. తక్కిన పోటీలన్నీ కొత్తూరు బాలుర పాఠశాలలో జరుగుతాయని వెల్లడించారు. 8న యోగా, బ్యాడ్మింటన్, 12న కబడ్డీ, త్రోబాల్, టెన్నికాయిట్, 13న వాలీబాల్, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్, 14న కబడ్డీ, త్రోబాల్, టెన్నికాయిట్, 15న వాలీబాల్, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్, 16న అథ్లెటిక్స్ ఉంటాయని తెలిపారు. రోజూ ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు.

క్యాంపస్‌లో భద్రత కట్టుదిట్టం



మాట్లాడుతున్న వీసీ జింకా రంగజనార్ధన

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) క్యాంపస్‌లో భద్రత కట్టుదిట్టం చేస్తున్నట్లు వీసీ డాక్టర్ జింకా రంగజనార్ధన తెలిపారు. భద్రత పెంపు అంశంపై కళాశాలలోని ప్రిన్సిపాల్ చాంబర్‌లో ఉద్యోగులతో మంగళవారం ఆయన సమావేశమై మాట్లాడారు. ప్రతి ఉద్యోగి వాహనానికి వర్సిటీ స్టిక్కర్ అందజేస్తామన్నారు. వాహనానికి విధిగా స్టిక్కర్ అతికించాలన్నారు. స్టిక్కర్ లేని వాహనాన్ని క్యాంపస్‌లోకి అనుమతించబోమన్నారు. ఇతరులకు గేట్ పాస్ మంజూరు చేస్తామన్నారు. క్యాంపస్‌లో సీసీ కెమెరాలు మరిన్ని పెంచేలా చర్యలు తీసకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ అరుణ కాంతి తదితరులు పాల్గొన్నారు.

నెట్టికంటుడిని దర్శించుకున్న ఎస్పీ



ఎస్పీ శ్రీనివాసరావు దంపతులకు స్వామి ఫొటో అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ఎస్పీ శ్రీనివాసరావు దంపతులు మంగళవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఎస్పీకి ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు, చిత్రపటం అందజేశారు.

ప్రజల్లో ఉనికి కోల్పోయిన సీపీఐ

- బీజేవైఎం సీమ జోనల్ ఇన్‌చార్జ్ ఆదిశేషు

గుంతకల్లు టౌన్: ఎన్నికల్లో తిరస్కరణ ఓటు (నోటా)తో కూడా పోటీ పడలేని సీపీఐ... జాతీయ హోదాతో పాటు ప్రజల్లో ఉనికి కోల్పోయిందని బీజేవైఎం రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ ఆదిశేషు విమర్శించారు. ప్రధాని మోదీ వైవాహిక జీవితంపై ఈ నెల 3న సీపీఐ ఏపీ కార్యదర్శి కె.రామకృష్ణ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం బీజేవైఎం ఆధ్వర్యంలో గుంతకల్లులోని పొట్టిశ్రీరాములు సర్కిల్‌లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. రామకృష్ణ ఫ్లెక్సీకి చెప్పుల దండ వేసి ఊరేగించారు. క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ బహిరంగ సభ నిర్వహించిన ప్రదేశాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేశారు. ఈ సందర్భంగా ఆదిశేషుతో పాటు బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మంజుల వెంకటేష్ మాట్లాడారు.

వివాహిత బలవన్మరణం




మృతులు యల్లమ్మ, వన్నూరుస్వామి

ఆత్మకూరు: కడుపు నొప్పి తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... ఆత్మకూరు మండలం ముట్టాలకు చెందిన రామాంజనేయులు, యల్లమ్మ (27) దంపతులు. వీరికి ఇద్దరు కుమార్తెలున్నారు. గొర్రెల పోషణతో కుటుంబాన్ని పోషించుకునేవారు. కొన్ని రోజులుగా కడుపునొప్పితో యల్లమ్మ బాధపడుతోంది. ఈ క్రమంలో మంగళవారం నొప్పి తీవ్రత భరించలేని ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమి సంహారక మందు తాగింది. విషయాన్ని గమనించిన చుట్టుపక్కల వారు కుటుంబసభ్యులను అప్రమత్తం చేసి అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తుచేపట్టినట్లు ఎస్ఐ జనార్ధన్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

రాయదుర్గం రూరల్: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. కణేకల్లు మండలం పూలచెర్లకు చెందిన బోయ రామప్ప కుమారుడు వన్నూరుస్వామి (33)కి రాయదుర్గం మండలం వడ్రహొన్నూరుకు చెందిన నాగవేణితో 8 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ఓ కుమార్తె ఉంది. ఇటీవల పండుగ కోసం వారం రోజుల క్రితం పుట్టింటికి వచ్చిన నాగవేణి కోసం రెండు రోజుల క్రితం వన్నూరు స్వామి వచ్చాడు. మంగళవారం ఉదయం ఊరి బయట ఉన్న వంకలో జాలి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొంత మంది కడుపు నొప్పి తాళలేక అని, మరికొందరు అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లుగా అనుమానాలు వ్యక్తం చేశారు. కాగా, ఘటనకు సంబంధించి తమకు ఎలాంటి సమాచారం లేదని పోలీసులు తెలిపారు.

నేమకల్లు ఆలయానికి పోటెత్తిన భక్తులు




నిమ్మకాయల అలంకరణలో నేమకల్లు ఆంజనేయస్వామి, దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

బొమ్మనహాళ్: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని బొమ్మనహాళ్ మండలం నేమకల్లులో వెలసిన ఆంజనేయస్వామి ఆలయానికి మూడో మంగళవారం భక్తులు పోటెత్తారు. ప్రధాన అర్చకుడు అనిల్ కుమారస్వామి ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. నిమ్మకాయలు, పూలు, తులసీ మాలలతో మూలవిరాట్‌ను అలంకరించారు. ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. సుందరకాండ పారాయణం, హోమాలు నిర్వహించారు.

క్లుప్తంగా

టీకాపై అవగాహన

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లకు వ్యాధినిరోధక టీకాపై మంగళవారం అవగాహన కల్పించారు. డాక్టర్ దయాకర్ మాట్లాడుతూ 11 రకాలకు సంబంధించి ఇచ్చే వ్యాధి నిరోధక టీకాపై అవగాహన కల్పించారు. వైఎస్సార్ కంటి వెలుగు కింద మండల వ్యాప్తంగా 580 మందికి కళ్లద్దాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆశాయాప్ ద్వారా గర్భిణుల సేవలు, ప్రసవాంతర సేవలు, తదితర వివరాలు నమోదు చేయాలన్నారు. డాక్టర్ నబిహా సుల్తానా, ఎంపీహెచ్ఓలు నిగేశ్వరయ్య, మునాఫ్, సీహెచ్ఓలు పాల్గొన్నారు.

12,13 తేదీల్లో ఆదివాసీల మహాసభ



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం టవర్‌క్లాక్: ఈనెల 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న అఖిత భారత ఆదివాసీల మహాసభను జయప్రదం చేయాలని ఏఎఫ్‌టీయూ నూతన రాష్ట్ర అధ్యక్షుడు పెద్దన్న, ఇతర నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం ఎన్జీవో హోంలో మహాసభ పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం పెద్దన్న మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన అటవీ సవరణ బిల్లును రద్దు చేయాలన్నారు. అటవీసంపద, పర్యావరణం, నదులను కాపాడుకోవాలన్నారు.

అవకతవకలుంటే తెలపండి



మాట్లాడుతున్న తహసీల్దార్ షర్మిల

ఆత్మకూరు: ఎక్కడైనా అవకతవకలు జరిగినట్లయితే మా దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ షర్మిల సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎంఈఓ నరసింహారెడ్డి, సీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య, ఎంపీపీ హేమలత, వీఆర్వోలతో కలిసి ఆహార సలహా సంఘం కమిటీ సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో రేషన్ దుకాణాల్లో ఇచ్చే బియ్యం, కంది పప్పు సక్రమంగా అందుతున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. రేషన్‌కార్డులకు సంబంధించి సమస్యలను పరిష్కరించాలన్నారు. పాఠశాలలకు బియ్యం సక్రమంగా అందుతున్నాయా? లేదా అని అడిగి తెలుసుకున్నారు.

సర్పరూపుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం శ్రావణమాస పూజలు నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, విశేష పూజలు చేశారు. స్వామిని ప్రత్యేకంగా పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం మంజునాథ స్వామికి రుద్రాభిషేకం చేశారు. ఆలయంలోని పార్వతిదేవికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించి, అలంకరించారు. అనంతరం మహా మంగళహారతి అందించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

పత్తా లేని పర్యవేక్షణ!

- నగరంలో అనుమతుల్లేకుండా ఆస్పత్రుల నిర్వహణ
- ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న వైద్యులు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న ఆరోగ్యశాఖ, డెమో విభాగం అధికారులు



డీఎంహెచ్ఓ కార్యాలయం

అనంతపురం క్రైం: వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. పేదలకు కూడా కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని సంకల్పించింది. అయితే ప్రజలకు సక్రమంగా వైద్యం అందేలా చూడాల్సిన అధికారులు పత్తాలేకుండా పోయారు. జిల్లాలోని ప్రభుత్వాస్పత్రులు, నర్సింగ్ హోంలు, క్లినిక్‌లు, స్కాన్ సెంటర్ల పర్యవేక్షణ ఆరోగ్యశాఖ, డెమో విభాగం అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఆస్పత్రులు, నర్సింగ్ హోంలు, క్లినిక్‌లు, స్కాన్ సెంటర్ల పర్యవేక్షణకు ఆరోగ్యశాఖ అధికారులు మంగళం పాడారు. జిల్లా కేంద్రంలోనే అనుమతులు లేకుండా అనేక ఆస్పత్రులు నిర్వహిస్తున్నారంటే అధికారులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో తెలుస్తోంది. ప్రధానంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, డెమో విభాగం అధికారులు ఎప్పటికప్పుడు ఆస్పత్రులను తనిఖీ చేయాలి. అనధికారకంగా ఆస్పత్రులు ఎన్ని ఏర్పాటయ్యాయో పూర్తి సమాచారం అధికారుల వద్ద ఉండాల్సి ఉంటుంది.

డెమో విభాగ అధికారుల బాధ్యతారాహిత్యం

ప్రైవేట్ ఆస్పత్రులు, నర్సింగ్ హోంలు, స్కాన్ సెంటర్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన బాధ్యత ఆరోగ్యశాఖలోని డిస్ట్రిక్ట్ ఎక్స్‌టెన్షన్ అండ్ మీడియా(డెమో)విభాగం అధికారులదే. డెమో విభాగంలో డెమో, డిప్యూటీ డెమో, కంప్యూటర్ అసిస్టెంట్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్, తదితర సిబ్బంది ఉంటారు. పలానా ఆస్పత్రులు ఆరోగ్యశాఖ అనుమతులు తీసుకున్నాయా లేదా, ఒక వేళ ఆస్పత్రుల అనుమతులు తీసుకున్నా..రెన్యూవల్ చేసుకున్నారా? ఫైర్ ఎన్‌ఓసీ అనుమతులున్నాయా లేదా అన్న కోణంలో లోతుగా ఆలోచించాలి. ఆస్పత్రుల సమాచారం స్పందనలో కలెక్టర్ గౌతమికి ఫిర్యాదు వెళ్లే వరకు ఆరోగ్యశాఖాధికారులకు తెలియదంటే వీరు ఏ స్థాయిలో విధులు నిర్వర్తిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

వైద్యులకు ధనార్జనే ధ్యేయం..

జిల్లా కేంద్రంలో ధనార్జనే ధ్యేయంగా కొందరు వైద్యులు పవిత్రమైన వైద్యవృత్తిని వ్యాపారం చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలు ఏమాత్రం పాటించలేదు. అందుకు నగరంలోని సాయినగర్ ఆరో క్రాస్‌లో ఓ క్లినిక్‌కు దరఖాస్తు చేసుకొని మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని ఏర్పాటు చేయడమే నిదర్శనం. అందులో అబార్షన్ పరికరాలు, మందులు ఉన్నట్లు ఆరోగ్యశాఖ అధికారుల తనిఖీలో గుర్తించారు. కాగా ఈ ఆస్పత్రిపై జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు వెళ్లింది. అయితే ఆరోగ్యశాఖ అధికారులు గుర్తించిన దాఖలాలు లేవు. శ్రీనివాసనగర్‌లోనూ ఎలాంటి అనుమతులు లేకుండా ఓ ప్రైవేట్ ఆస్పత్రిని నిర్వహించారు.



సాయినగర్‌లోని ఓ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో అబార్షన్ పరికరాలను చూపుతున్న అధికారులు (ఫైల్)

అందులో గర్భిణులు, బాలింతలకు సేవలందించారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ ఆస్పత్రిలో ఆరోగ్యశాఖ అనుమతి లేకుండానే ఫెర్టిలిటీ సేవలు ప్రారంభించారు. సంగమేశ్వర సర్కిల్‌లోని ఓ ఆస్పత్రి, ఆదిమూర్తినగర్‌లోని ఓ ఆస్పత్రిని నిర్వాహకులు రెన్యూవల్ చేసుకోలేదు. ముఖ్యంగా ఓపీ నుంచి ఐపీ వరకు భారీగా వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ఈ ఆస్పత్రుల్లో అక్రమాలు వెలుగు చూశాయి. ఇంకా నగరంలోని రాంనగర్, సాయినగర్ తదితర ప్రాంతాల్లో పుట్టగొడుగుల్లా ఆస్పత్రులు వెలిశాయి. వీటిపై ఆరోగ్యశాఖ అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపడితే అసలు విషయం వెలుగులోకొస్తుందని ఆరోగ్యశాఖ అధికారులు చెప్తున్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల వివరాలు ఇలా..

పాలీక్లినిక్‌లు	6
20 పడకల్లోపు ఆస్పత్రులు	113
21 నుంచి 50 పడకల్లోపు ఆస్పత్రులు	31
51 నుంచి 100 పడకల్లోపు ఆస్పత్రులు	16
101 నుంచి 200 పడకల ఆస్పత్రులు	4
200 పడకల కంటే ఎక్కువ ఉన్న ఆస్పత్రులు	2
డయాగ్నస్టిక్ సెంటర్లు (బేసిక్)	81
హైఎండ్ డయాగ్నస్టిక్ సెంటర్లు	6

డీఎంహెచ్ఓ దృష్టికి తీసుకెళ్తాం

అనధికారికంగా నిర్వహిస్తున్న ఆస్పత్రులపై చర్యలు తీసుకునే విషయాన్ని డీఎంహెచ్ఓ దృష్టికి తీసుకెళ్తాం. ఆస్పత్రులను నిరంతరం పర్యవేక్షించాల్సిన బాధ్యత డెమో సిబ్బందిదే. ఈ విషయంపై డీఎంహెచ్ఓ స్పందించాల్సి ఉంది.
– ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ, సుజాత

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న జేసీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరినాథ్ రెడ్డి

రాప్తాడు: నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు వర్తిస్తున్నాయని జేసీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరినాథ్ రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో చేపట్టబోవు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంపై వలంటీర్లు, గృహ సారథులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడిందన్నారు. రాబోవు ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలందరూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా చూడాలని ఆకాంక్షిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అందిస్తున్న సంక్షేమ పథకాలను పొరుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సైతం ఆదర్శంగా తీసుకొని వాటిని అమలు చేస్తున్నారన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా నాలుగేళ్లుగా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, ఏట రత్నబాయి, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

రామగిరి: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని శ్రీసత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ చేతన్ ఆదేశించారు. మంగళవారం రామగిరిలోని పేరూరు,గంతిమర్రి గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ రీసర్వేను సమగ్రంగా చేయాలన్నారు.ప్రజలు ఇబ్బందులు పడకుండా అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణస్వామి, రెవెన్యూ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్



రాప్తాడులో పింఛన్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు



వద్దుపల్లిలో పింఛన్లు అందిస్తున్న దృశ్యం

రాప్తాడు: అర్హత ఉంటే చాలు.. సిఫార్సులేకుండా పింఛన్లు మంజూరవుతున్నాయని వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల వ్యాప్తంగా నూతనంగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ మాట్లాడుతూ టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు, టీడీపీ నాయకులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా పింఛన్లు మంజూరయ్యేవి కావన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు, సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా అర్హులను గుర్తించి, పింఛన్లు ఇంటివద్దకు వెళ్లి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సాకే చంద్ర, చింతకాయల జయన్న, మన్నల రవి, నారాయణ, చిరుతల నాగేంద్ర పాల్గొన్నారు.

జగనన్నకు రుణపడి ఉంటాం

ఆత్మకూరు: ముఖ్యమంత్రి జగనన్నకు రుణపడి ఉంటామని పింఛన్ పొందిన లబ్ధిదారులు అన్నారు. మంగళవారం మండలంలోని వద్దుపల్లి గ్రామంలో నూతనంగా మంజూరైన పింఛన్లను సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ఓబిరెడ్డి, శివారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

పంచలోహ విగ్రహం మాయం

యాడికి: మండల కేంద్రంలోని గంగమ్మ గుడిలోని శ్రీకృష్ణుడి పంచలోహ విగ్రహం చోరీకి గురైంది. వివరాలు.. స్థానిక గంగమ్మ గుడి ఆవరణలో ఏటా ప్రజల విరాళాలతో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించి, అనంతరం పంచలోహ విగ్రహాన్ని గంగమ్మ గుడిలో భద్రపరుస్తారు. గత సోమవారం శ్రీకృష్ణుడి పంచలోహ విగ్రహం శుభ్రం చేసేందుకు కమిటీ సభ్యులు, ఆలయ పూజారితో కలిసి ఆలయంలోకి వెళ్లి చూడగా పెట్టెలో భద్రపరచిన 24 కేజీల పంచలోహ విగ్రహం కనిపించలేదు. దీనిపై ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డిని సంప్రదించగా విగ్రహం చోరీ ఘటన తమ దృష్టికి రాలేదన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా

అనంతపురం క్రైం: నగరంలో నెలకొన్న సమస్యలకు పరిష్కారం చూపాలని సీపీఎం నాయకులు మంగళవారం నగరపాలక సంస్థ ముందు ధర్నా చేపట్టారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేయాలని, నగర విస్తీర్ణకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య పెంచాలని, తిక్కరంగయ్యస్వామి గుడి నుంచి తపోవనం దారి విస్తరణ చేయాలని, రిషిత స్కూల్ దగ్గర బ్రిడ్జి నిర్మించాలని, నడిమివంకకు రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని, నడిమివంక, మరువవంక వద్ద పూడికతీత పనులు చేపట్టాలని నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్ భాగ్యలక్ష్మికి వినతిపత్రం అందించారు. సీపీఎం నాయకులు ఆర్‌వీ నాయుడు, రామిరెడ్డి, వెంకటనారాయణ, ముర్తుజ, గోపాల్, బాలకృష్ణ, మసూద్, ప్రసాదు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే చర్యలు

- అనంతపురం ఆర్డీఓ మధుసూదన్

అనంతపురం క్రైం: బాల్యవివాహాలను ప్రోత్సహిస్తే చర్యలు తప్పవని ఆర్డీఓ మధుసూదన్ తెలిపారు. మంగళవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో బాల్య వివాహాల నిషేధం చట్టం – అధికారుల విధులు బాధ్యతలపై డివిజనల్ స్థాయిలో తహసీల్దార్, వైద్యాధికారులు, ఎంపీడీఓలు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, తదితరులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో వీఆర్ఓ, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ, సీడబ్ల్యూపీఓలు బాల్య వివాహాలతో ఎదురయ్యే అనర్థాలను ప్రజలకు వివరించాలన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్న విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టడానికి కొత్తగా ప్రభుత్వం విడుదల చేసిన జీఓను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై వివరించారు. అనంతరం బాల్య వివాహాల నిషేధ చట్టం -2006 పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత, డీసీపీఓ సుబ్రమణ్యం, అనంతపురం అర్బన్ సీడీపీఓ లలితమ్మ, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ కృష్ణమాచారి పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



శ్రీచైతన్య పాఠశాలలో వేడుకలు



మాంటిస్సోరి స్కూల్‌లో చిన్నారుల సందడి

రాప్తాడురూరల్: నగరంలోని వివిధ స్కూళ్లలో మంగళవారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపిలక వేషధారణల్లో అలరించారు. విద్యార్థులకు శ్రీకృష్ణ జన్మాష్టమి గురించి తెలియజేశారు. కోలాటం, ఉట్టి కొట్టే కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహించారు. కోర్టురోడ్డులోని శ్రీచైతన్య పాఠశాల వేడుకల్లో ఏజీఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ తబస్సుమ్, వైస్ ప్రిన్సిపాల్ బాలకృష్ణ, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, డీన్లు సిరాజుద్దీన్, అప్పలనాయుడు, మహేష్, ప్రైమరీ ఇన్‌చార్జ్‌లు నీరజ, భారతి, తేజస్విని, ఏఓ గోపాల్ పాల్గొన్నారు.

మాంటిస్సోరి విద్యా సంస్థల్లో...: సంగమేష్‌నగర్, గుత్తిరోడ్డులోని మాంటిస్సోరి విద్యా సంస్థల్లో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. పాఠశాలల ప్రాంగణాలను తోరణాలు, పూలమాలలు, వెన్న కుండలు, రంగవల్లులతో సుందరంగా అలంకరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సి.సూర్యనారాయణ రెడ్డి, కార్యదర్శి కె.మాధవి, ప్రిన్సిపాళ్లు కె.పద్మావతి, ఎ.రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణికి ఆర్థికసాయం



సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణి రాధికకు నగదు అందిస్తున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: జిల్లాకు చెందిన భారత సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణి జేడీ రాధికకు నోబుల్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో రూ.22,500 ఆర్థికసాయం అందించారు. మంగళవారం మేయర్ క్యాంపు కార్యాలయంలో నగదును క్రీడాకారిణికి అందించారు. సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణిగా రాధిక ఇప్పటి వరకు నాలుగు సార్లు భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. వచ్చే నెల 6 నుంచి 8 వరకు కెనడా హాపెనింగ్‌లో జరిగే లాక్రోస్ టోర్నీలో పాల్గొననుంది. టోర్నీకి వెళ్లేందుకు రూ.3 లక్షల వరకు ఖర్చవుతుంది.

రేపు భావసార క్షత్రియ మండలి వార్షికోత్సవం

అనంతపురం కల్చరల్: నగరంలోని రామనగర్‌లో వెలిసిన రుక్మిణీ పాండురంగ విఠల దేవస్థానంలో భావసార క్షత్రియ మహిళా మండలి 13వ వార్షికోత్సవం, శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఈనెల 7న ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధులు ప్రశాంతిబాయి, ఆనందరావు తెలిపారు. గురువారం సాయంత్రం 4 గంటలకు గోవింద నామావళి, 5 గంటలకు దైహండి పేరుతో సాగే ఉట్టికొట్టే ఉత్సవం, సాయంత్రం వందల సంఖ్యలో తరలి వచ్చే చిన్నారుల శ్రీకృష్ణ గోపికల నాట్యప్రదర్శనలుంటాయన్నారు.

సమాజంలో గురువుకు ప్రత్యేక స్థానం

అనంతపురం: గురువు లేనిదే నాగరికత లేదని, సమాజంలో గురువుకు ప్రత్యేక స్థానం ఉందని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన పేర్కొన్నారు. మంగళవారం జేఎన్‌టీయూ అనంతపురంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ కేశవ రెడ్డి, ప్రొఫెసర్ ఏ సురేష్ బాబు, పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్, డాక్టర్ ఎం.రామశేఖర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అరుణ కాంతి పాల్గొన్నారు.

- శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని క్యాంపస్ కళాశాలలో నిర్వహించిన గురుపూజోత్సవం సందర్భంగా వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ఉత్తమ ఆచార్య పురస్కార గ్రహీత (2022) ప్రొఫెసర్ మునినారాయణప్పను సన్మానించారు. ఆయన సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ కృష్ణకుమారి, సదస్సు కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రమౌళిరెడ్డి, డాక్టర్ ఫిరోజ్ బాబు, డాక్టర్ శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.
- ఎస్కేయూ క్యాంపస్ కళాశాలలో ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉత్తమ అధ్యాపక అవార్డులు ప్రదానం చేశారు. బయోటెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ డి. మురళీధర్ రావుకు పురస్కారాన్ని అందజేశారు. డాక్టర్ పతికి రమేష్ నారాయణ, సుంకర రమేష్ పాల్గొన్నారు.
- జిల్లా కేంద్ర గ్రంథాలయంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. సంస్థ చైర్ పర్సన్ ఎల్‌ఎం ఉమామోహన్ రెడ్డి, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎల్‌ఎం మోహన్‌రెడ్డి, కార్యదర్శి రమ పాల్గొన్నారు.
- ఓటీపీఆర్ఐలో నిర్వహించిన కార్యక్రమానికి జేఎన్‌టీయూ అనంతపురం పాలకమండలి సభ్యుడు , డైరెక్టర్ ప్రొఫెసర్ బి. దుర్గాప్రసాద్ హాజరయ్యారు.



మునినారాయణప్పను సన్మానిస్తున్న వీసీ రామకృష్ణారెడ్డి

అనంతపురం కల్చరల్: నగరంలోని క్రీసెంట్ రెయిన్‌బో హోమ్‌లోని పిల్లలు ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం సాయంత్రం కమ్యూనిటీ కేర్ అండ్ లర్నింగ్ సెంటర్‌లో జరిగిన వేడుకల్లో సర్వేపల్లి చిత్రపటానికి అనాథ చిన్నారులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఆర్‌డీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సద్దాం బాషా, సర్పంచ్ ఆశాబీ మాట్లాడారు.



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురుపూజోత్సవం



జేఎన్‌టీయూఏలో వేడుకల్లో పాల్గొన్న సిబ్బంది

అనంతపురం టవర్‌క్లాక్: స్థానిక పెన్షనర్స్ భవనంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్దన్న గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు జయరామప్ప, రామకృష్ణ, తిప్పన్న, రాజు, సూర్యనారాయణ, దాసరి సూర్యనారాయణ, సత్యనారాయణ, రమణ, రామిరెడ్డి పాల్గొన్నారు.

అనంతపురం క్రైం: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి కార్యక్రమాన్ని పురస్కరించుకొని మంగళవారం ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవిని ఎన్ఎస్ఎస్ యూనిట్ విభాగం ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం పెథాలజీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ శివశంకర్ నాయక్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, 2కే20, 2కే21,2కే22 బ్యాచ్ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ప్రిన్సిపాల్‌ను సన్మానించారు.



ఎన్జీవో హోంలో సర్వేపల్లి చిత్రపటానికి నివాళి

రాప్తాడు: మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. రాప్తాడు జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులను సన్మానించారు.

రాప్తాడు: హంపాపురం సమీపంలోని ఎస్వీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో గురు పూజోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కృష్ణా రెడ్డి, వైస్ చైర్మన్ వెన్నపూస రవీంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ టి.సూర్యశేఖర్ రెడ్డి, సీఈఓ ఆనంద్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాసులు నాయక్ పాల్గొన్నారు.



వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న దృశ్యం



రాప్తాడులో గురువులను సన్మానిస్తున్న విద్యార్థులు



ఎస్వీఐటీ కళాశాలలో వేడుకలు నిర్వహిస్తున్న సిబ్బంది



సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం